


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధుల నియంత్రణ కోసం పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించేలా అవగాహన కల్పించాలని, ఒకవేళ శుభ్రం చేయకుంటే యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలన్నారు. ఆశా వర్కర్లు ప్రతీరోజు 50 ఇళ్లను సందర్శించి జ్వర సర్వే నిర్వహించాలని, యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

కందుకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నామని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శులు నాగార్జున, శ్రీనివాసచారి తెలిపారు. సమావేశానికి వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎస్సీ సంఘాల ముఖ్య నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు మల్లెపల్లి కృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు యాచారం జంగయ్య, జి.జంగయ్య, డి.దుర్గాప్రసాద్, రాజు పాల్గొననున్నారు.

ప్రభుత్వం నగర శివార్లలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' త్వరలోనే పట్టాలెక్కనుంది. హైదరాబాద్ సిటీపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం నగర శివార్లలో అత్యాధునిక రీతిలో అన్ని హంగులతో భవిష్య నగరానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. మహానగర భవిష్యత్తు రూపురేఖలు మార్చే విధంగా ఆర్థిక, వాణిజ్య రంగాలకు కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇటీవలే ఫ్యూచర్ సిటీ పరిధి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి కేబినెట్ ఆమోదం కూడా లభించింది. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కన్సల్టెన్సీ నియామకం కోసం ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే మరో మూడు నుంచి నాలుగునెలల్లోపు ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ విడుదల చేసి నిర్మాణ పనులు చకచకా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.



పట్టాలెక్కనున్న ఫ్యూచర్‌సిటీ

భవిష్యనగరి మాస్టర్ ప్లాన్‌కు కసరత్తు

- కన్సల్టెన్సీ కోసం త్వరలో టెండర్లు
- మూడు నెలల్లో ప్రక్రియ పూర్తిచేసే అవకాశం
- అతి త్వరలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు శంకుస్థాపన
- కంపెనీలకు భూకేటాయింపులు షురూ!



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : మొత్తం ఏడు మండలాల్లోని 74 గ్రామ పంచాయతీలు (56 రెవెన్యూ గ్రామాలు) పరిధిలోని 765.28 చ.కి.మీ ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ అథారిటీని ఏర్పాటు చేశారు. దీనిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు సరికొత్త మాస్టర్ ప్లాన్ కూడా ప్రభుత్వం రూపొందిస్తోంది. ఫ్యూచర్ సిటీ పరిధిలో 1.80లక్షల ఎకరాల విస్తీర్ణంలో భూములున్నాయి. ఇందులో దాదాపు 15వేల ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. మరో 15వేల ఎకరాల అటవీ ప్రాంతంలో నైట్‌సఫారీ ఇతర అటవీ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఫ్యూచర్‌సిటీలో అతిథ్య రంగానికి పెద్ద పీట వేయనున్నారు. స్పెషల్ ఎకనామిక్ జోన్‌కు సమీపంలోని రిక్రియేషన్ జోన్లు ఏర్పాటు చేయడంతో పాటు జనావాసాలకు అనుగుణంగా జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో తొలి నెట్‌జీరో స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ ఇక్కడ నిర్మించబోతోంది. భవిష్యత్తు భారత నగరాలకు నమూనాగా అత్యాధునిక రీతిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో నూతన నగరి నిర్మాణం జరగనుంది. ఎకో సిస్టమ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్య, వైద్య, ఉపాధి, ఆరోగ్యం, పర్యాటక, క్రీడా రంగాలకు భూములు కేటాయిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ పరిధి శ్రీశైలం హైవే, సాగర్ హైవే, ఔటర్ రింగురోడ్డు,

మిగతా 7వ పేజీలో...



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అభ్యంతరాలుంటే తెలపండి

నేటి వరకు స్వీకరణ.. 31న పరిష్కారం

» సెప్టెంబర్ 2న ఓటరు తుది జాబితా విడుదల

» అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితాను అనుసరించి గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 30 వరకు సరిచేసుకోవచ్చన్నారు. అలాగే పోలింగ్ బూత్‌ల జాబితాలో అభ్యంతరాలు ఉన్నా తెలియజేయవచ్చని సూచించారు. ఈ నెల 31న ఆయా మండలాల్లో ఎంపీడీవోలు నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశంలో కూడా అభ్యంతరాలు తెలుపవచ్చన్నారు. దీని ఆధారంగా జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. వచ్చేనెల 2న వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కొన్ని తండాల్లో పోలింగ్ బూత్‌లు దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయని, కొత్తూరు పరిధిలోని పరిశ్రమలలో పనిచేస్తున్న వారికి సమీపంలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశంలో డీపీవో సురేష్ మోహన్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీపీఐ నాయకుడు పాలమాకుల జంగయ్య, సీపీఎం నాయకుడు పగడాల యాదయ్య, టీడీపీ నాయకుడు రామేశ్వరరావు, ఎంఐఎం నాయకుడు తౌసిఫ్ మొహ్మద్, బి.సుధాకర్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, నిట్టు జగదీశ్ పాల్గొన్నారు.

పరీక్షలను పండగలా భావించాలి

కేశంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరీక్షలను ఓ పండగలా భావించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మనువడు, ప్రముఖ సైకాలజిస్ట్ మందముల రాధాకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను అడియాసలు చేయొద్దన్నారు. గురువుల సూచనలు, సలహాలను పాటించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.



అవగాహన కల్పిస్తున్న రాధాకృష్ణారావు

నేరస్థులు, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి

» శంషాబాద్ డీసీపీ రాజేష్

కొత్తూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నేరస్థులు, మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ సూచించారు. కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పైఅంతస్తులో ఏర్పాటు చేసిన అదనపు గదులను శుక్రవారం సాయంత్రం డీసీపీ ప్రారంభించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కొత్తూర్ పారిశ్రామికవాడలో మాదకద్రవ్యాల విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వినాయక నిమజ్జనాల కోసం చెరువులు, కుంటల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్‌ఐలు గోపాలకృష్ణ, సత్యశీలారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో అదనపు గదులను ప్రారంభిస్తున్న శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్

ప్రభుత్వ లక్ష్యాల పూర్తికి చొరవ చూపాలి

» అధికారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశం

ఆమనగల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకుపోయి లక్ష్యాల పూర్తికి ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రం నుంచి తగిన యూరియా కేటాయింపులు లేకపోవడం వల్ల సమస్య ఏర్పడిందని ఆరోపించారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న చెరువు కుంటలను మరమ్మతులు చేసి ఆధునీకరిస్తామన్నారు. సమావేశంలో నాయకులు బ్యాంగి ఆనంద్ కుమార్, సంజీవ్ కుమార్, అశోక్‌రెడ్డి, యెన్నం భూపతి రెడ్డి, పర్వత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

మరకత శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

శంకర్‌పల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప మరకత శివాలయంలోని శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. 11వ శతాబ్దంలో చాళుక్య రాజు ప్రతిష్ఠించిన ఈ శివలింగంపై శుక్రవారం రోజున ఉదయం 7 గంటల ప్రాంతంలో సూర్య కిరణాలు పడటంతో భక్తులు ఆనందపరవశమయ్యారు. సూర్యకిరణాలు శివలింగాన్ని తాకిన సమయంలో భక్తులు అభిషేకంతో పాటు పూజలు చేస్తే శుభం కలుగుతుందని అర్చకులు వీరేశం తెలిపారు. ప్రతీ సంవత్సరం ఆగస్టు నెలలో ఇలా శివలింగంపై సూర్యకిరణాలు పడతుంటాయని తెలిపారు.



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం 7

కేంద్రం వివక్షతోనే యూరియా కొరత

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సకాలంలో యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం వల్లే కొరత ఏర్పడిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నేతలతో కలిసి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు కుమ్మక్కై ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. కేంద్రానికి తెలంగాణ రైతుల గోస కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందుగుల సత్యనారాయణ, ఎండెల బాబురావు, గణేష్‌నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

» రోజంతా పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు

» సరిపడా సరఫరా లేకపోవడంతో అన్నదాతల ఆందోళన



షాబాద్‌లో యూరియా కోసం రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

పోలీస్ బందోబస్తు మధ్య...


శంకర్‌పల్లిలోని సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం పోలీస్ బందోబస్తు నడుమ రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండేసి బస్తాలను అందజేశారు. మొత్తం 712 బస్తాల యూరియా అందజేసినట్లు వ్యవసాయాధికారి చైతన్య వివరించారు.



యాచారం సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

షాబాద్/యాచారం/తలకొండపల్లి/ఆమనగల్లు/శంకర్‌పల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. తెల్లవారుజాము నుంచే యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. పనులన్నీ మానేసి పీఏసీఎస్ కార్యాలయాల వద్ద క్యూలో నిల్చుంటున్నారు. గంటల తరబడి లైన్‌లో నిలబడినా యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంతో అన్నదాతలు నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. షాబాద్ మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి 900 బస్తాల యూరియా వచ్చింది, దాన్ని ఈనెల 25,28న పంపిణీ చేశారు. ఇంకా సరిపోవకపోవడంతో షాబాద్‌లో పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. యూరియా లేకపోవడంతో అన్నదాతలు రోడ్డెక్కి ధర్నా చేశారు. భారతీయ కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి రైతులకు మద్దతుగా

మిగతా 8వ పేజీలో...





విభేదాలు వీడి విజయం సాధిద్దాం

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట/షాద్‌నగర్ అర్బన్/నందిగామ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు విభేదాలు వీడి స్థానిక సంస్థల సమరంలో విజయం సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కేశంపేట, కొత్తూర్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు అహర్నిశలు కృషిచేసి తనను గెలిపించారని, వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపుపై కార్యకర్తలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కేశంపేట, కొత్తూరు మండలాధ్యక్షులు గూడ వీరేశ్, జంగ నరసింహయాదవ్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి జగదీశ్వరప్ప, బాల్‌రాజ్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్, కరుణాకర్, శ్రీధర్ రెడ్డి, అనుమగళ్ల రమేష్, గిరిధర్ యాదవ్, అబ్బి సుందరయ్య, మల్లేష్, ఆనంద్ రెడ్డి, అనసూయమ్మ, సురేష్ మాదిగ, రావులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌షిప్ సమస్యలను పరిష్కరిస్తా..

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీ సాయి బాలాజీ టౌన్ షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. టౌన్‌షిప్‌లో అమృత్-2 తాగునీటి పథకంలో భాగంగా రూ.5 కోట్లతో చేపట్టే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇంటింటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. టౌన్‌షిప్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, శివశంకర్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొప్పునూరి ప్రవీణ్‌కుమార్, కరుణాకర్, ముబారక్, ఖదీర్, మురళీమోహన్, నలమోని శ్రీధర్, రాజారెడ్డి, మురళీధర్‌రావు, శ్రీనివాస్, బాలునాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నందిగామ మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో ఆలయ ముఖద్వారంతోపాటు కమ్యూనిటీ హాల్, ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ నాయకులు రాంరెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, నర్సింలు, రాజగోపాల్, కె.వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలలు కల్పంచడమే లక్ష్యమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులకు కొత్త బెంచీలను, ఫర్నిచర్ అందజేశారు. ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మహిత ఎన్జీవో సహకారంతో పాఠశాలకు ఫర్నిచర్, ఆర్‌వో ప్లాంటును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు దాతలు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఆలయ హుండీ లెక్కింపు

కులకచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ.2,67,710 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో బాలనర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభం

కొందుర్గు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : కొందుర్గు మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో 2025-26 సంవత్సరం ప్రీప్రైమరీ విద్యాభ్యాసం ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి గాయత్రిదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రీప్రైమరీ విద్య బోధన కోసం ఒక టీచర్ పోస్టు, ఆయా కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిపై కేసు

ధారూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ధారూరు-వికారాబాద్ రోడ్డుపై అనుమతి లేకుండా రాస్తారోకో చేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌తో పాటు 20 మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ధారూరు సీఐ రఘురాం తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రోడ్డును అడ్డగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పించి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించారని ఆయన తెలిపారు. ఆనంద్‌తో పాటు, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విజయ్, చిన్నయ్య గౌడ్, రాములు, రహిమతుల్లా ఖాన్, గోవింద్ రాజ్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, జహంగీర్, చాన్, తదితరులపై కేసు నమోదయ్యాయి.



స్వాతి కుటుంబానికి అండగా బీసీ సమాజం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


స్వాతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

వికారాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైన స్వాతి కుటుంబానికి బీసీ సమాజం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం కామారెడ్డిగూడలో స్వాతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబమంతా కలిసి పక్కా ప్రణాళికతోనే స్వాతిని హత్య చేశారని ఆరోపించారు. మేడిపల్లిలో మహేందర్ రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్న బీసీ బిడ్డ స్వాతిని హత్య చేయడం దారుణమని, హత్య జరిగిన ముందు రోజే గ్రామం నుంచి మహేందర్ రెడ్డి తల్లిదండ్రులు వెళ్లారని తెలుస్తోందన్నారు. మేడిపల్లి సీఐ గోవర్ధన్ రెడ్డి హంతకుడు మహేందర్ రెడ్డి ఒక్కడినే అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులను కాపాడారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో క్షేమంగా జైలుకు పంపిస్తున్నారని, వెంటనే మహేందర్ రెడ్డి కుటుంబాన్ని అరెస్ట్ చేయాలన్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డపై ఇలా జరిగితే పట్టించుకోరా అని ప్రశ్నించారు. అధికారులపై చర్యల కోసం అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లేందుకు సిద్ధమని, శాసన మండలిలో సైతం ఈ అంశంపై మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ సమన్వయకర్త వట్టే జానయ్య యాదవ్, ఓదేలు యాదవ్, నాగరాజు, రవీందర్, వెంకటేశ్వర్లు యాదవ్, బొడ్డుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఆదర్శవంతంగా ఉండాలి

మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి


గోపాల్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్ మనుచౌదరి


కీసర రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు ఆదర్శవంతంగా ఉండాలని మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోపాల్ రావు 35 ఏళ్ల అధికారిగా 14 జిల్లాల్లో పని చేసి ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారన్నారు. పదవీ విరమణ రోజున బాలికలు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో వారికి సైకిళ్లు వచ్చేలా కృషి చేశారన్నారు. ముందుగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా, డీఆర్వో హరిప్రియ, డీఆర్డీఓ సాంబశివరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా మైనారిటీ అధికారి కాంతమ్మ, డీఎంహెచ్ఓ ఉమాగౌరీ, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, సివిల్ సప్లై డీఎం సుగుణాబాయి, ఏవో రామ్మోహన్, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేజీబీవీని సందర్శించిన కడా అధికారులు


విద్యార్థులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తరగతి గదులు, వంట గది తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. తరగతి గదులు, డైనింగ్ హాల్ సరిపోవడం లేదని ప్రత్యేకాధికారి స్రవంతి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నివేదిక తయారు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కడా ప్రత్యేకాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ పాల్గొన్నారు.







చిరస్మరణీయుడు సర్వాయి పాపన్నగౌడ్


సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనగారిన వర్గాలు, బహుజనుల ఐక్యత కోసం పోరాడిన సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మండలం ననాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాపన్నగౌడ్ పేదల అభ్యున్నతికి ఎంతగానో పోరాడారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా.. ఆందోళన వద్దు

పరిగి,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందరాదని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, పరిగి ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం పరిగిలోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరిగిలోని షాపుల్లో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిగిలోని మనగ్రోమోర్ సెంటర్‌లో 193 బస్తాలు, గౌరిశంకర్ షాపులో 618, లక్ష్మీనరసిహ్మషాపులో 287 బస్తాలు, ఆగ్రోస్‌లో 20, గణపతి గడిసింగాపూర్, ఆగ్రోస్ రాఘవాపూర్‌లలో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇంకా వస్తుందని, రైతులు ఆందోళన చెందరాదని సూచించారు. ప్రస్తుతం రైతులు పత్తిపంటకు నానో యూరియాను పిచికారీ చేస్తే పంట బాగా వస్తుందని తెలిపారు. సమావేశంలో ఏడీఏ లక్ష్మీకుమారి, ఏవో రజిత, ఏఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు కట్ట వద్ద శుక్రవారం రాత్రి రాచకొండ పోలీసుకమీషనర్ సుధీర్‌బాబు వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు వైపు ఉన్న బారికేడ్ల లోపలికి ఎవరూ వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను పరిశీలిస్తుండాలన్నారు. అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రశాంతంగా వినాయక నిమజ్జనం జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట భువనగిరి డీసీపీ ఆకాంక్ష యాదవ్, ఏసీపీ రాహుల్‌రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్, సీఐ ఎం. బాలస్వామి, ట్రాఫిక్ సీఐ రవీందర్, ఎస్ఐ శేఖర్, నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, సామల అమర్, రాజేందర్ గౌడ్, యుగేందర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం దుద్యాల మండలంలోని చెట్టుపల్లి తండాలో రూ.30 లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సిములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, శేఖర్, మెరుగు వెంకటయ్య, సీసీ వెంకటయ్యగౌడ్, పులిందర్‌రెడ్డి, రవీందర్ నాయక్, కృష్ణ, రవినాయక్, శ్రీశైలం, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కనీసం మూడింటినైనా అమలు పర్చడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప.. కాంగ్రెస్ చేసిందేమీ లేదని.. ఈ విషయం ప్రజలకు వివరించడంలో నాయకులు, కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, చివరకు వార్డు సభ్యులైనా సరే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే నాయకులు, కార్యకర్తలతో చర్చించి సాధ్యమైనంత వరకు ఒక్క స్థానంలో ఒక్కరే పోటీ చేసేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాను జాగ్రత్తగా సరిచూసుకోవాలన్నారు. నాయకులు రాజునాయక్, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్, కె.చంద్రయ్య, ఎం.రాఘవేందర్‌రెడ్డి, నందం, యాదయ్య, జంగయ్య, జానారెడ్డి, రమేష్, వీరుబాబు, ప్రభాకర్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ 66 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.11,01,276 లక్షల చెక్కులు అందించినట్లు చెప్పారు. తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష

» తీర్మానించిన గట్టిప్పలపల్లి గ్రామస్తులు

తలకొండపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నెలల కాలంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు అన్నారు. సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించకపోతే, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పట్టించుకోకపోతే మరుసటి రోజు నుంచి ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. గట్టిప్పలపల్లి గ్రామంలో శుక్రవారం జేఏసీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్ కార్యాచరణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. రిలే నిరాహార దీక్షలను ఆమరణ నిరహార దీక్షగా మార్చాలని తీర్మానించారు. మండల కేంద్రం ఏర్పాటు చేసే వరకు ఎంతటి పోరాటాలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పట్టాలెక్కనున్న ఫ్యూచర్‌సిటీ

(ఐదో పేజీ తరువాయి)

రీజినల్ రింగురోడ్డు మధ్యలోనే ఉంది. ఫ్యూచర్ సిటీకి దక్షిణాన రీజినల్ రింగురోడ్డు, ఉత్తరాన ఔటర్ రింగురోడ్డు, అలాగే పడమర శ్రీశైలం హైవే, తూర్పున నాగార్జున సాగర్ హైవే మధ్య ఉన్న ప్రాంతాలన్నీ ఉంటాయి. ఫ్యూచర్ సిటీకి అన్ని వైపులా కనెక్టివిటీ కోసం కొత్త రహదారుల నిర్మాణాలు కూడా చేపడుతోంది. ఈప్రాంత పరిధిలో రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కన్సల్టెన్సీ నియామకం కోసం ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది. అన్ని అనుకున్నట్లు జరిగితే మరో మూడు నుంచి నాలుగునెలల్లోపు ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులు కొంత సమయం అడిగినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి వీలైనంత త్వరగా మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవానికి ఫ్యూచర్ సిటీలోని 56 రెవెన్యూ గ్రామాల్లో 30 గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటికే ఉన్నందున కొత్తగా రూపొందించే మాస్టర్ ప్లాన్‌కు ఉపయోగకరంగా ఉంటుంది. మిగతా 26 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సమాచారం క్రోడీకరించి దీనిపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. మాస్టర్ ప్లాన్ వీలైనంత త్వరగా విడుదల చేసి మిగతా నిర్మాణ పనులు చకచకా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫ్యూచర్ సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేసి ఇప్పటికే దాదాపు ఏడాదిన్నర వుతుంది. ప్రభుత్వం అనుకున్న విధంగా ఇక్కడ పనులు మొదలు కాలేదు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు వ్యాపార కంపెనీలు, రియల్ ఎస్టేట్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయి. అయితే మాస్టర్ ప్లాన్ పూర్తయితేనే ఇక్కడ నిర్మాణ పనులు ఊపందుకునే అవకాశాలు ఉంటాయి. తాము భూములు కొనుగోలు చేసినా చివరకు మాస్టర్ ప్లాన్‌లో ఈ ప్రాంతం ఏ జోన్‌లో ఉంటుందోననే ఆందోళన పెట్టుబడిదారుల్లో ఉంది. అందుకే ఇక్కడ భూముల క్రయవిక్రయాలు ఇంకా ఊపందుకోలేదు.



ఊరటనిస్తారా?

ఫార్మాసిటీ ఏర్పాటు సమయంలో ఈ ప్రాంతంలోని కొన్ని గ్రామాలను బఫర్ జోన్‌లో అప్పటి ప్రభుత్వం పెట్టింది. ఫార్మాసిటీకి ఏడు కిలో మీటర్ల దూరం వరకు బఫర్ జోన్ ఉంటుందని, అందువల్ల ఇక్కడ నిర్మాణాలకు అనుమతి ఇవ్వరాదని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనిపై అధికారిక ఉత్తర్వులు ఇవ్వలేదు. దీనిపై అప్పట్లో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో బఫర్ పరిధిలోని ఒక కిలో మీటర్ పరిధికి కుదించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాల్లో భూముల క్రయ విక్రయాలు జరగడం లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫార్మాసిటీకి బదులు ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని ప్రకటించింది. కానీ ఇంతవరకు ఈ బఫర్ జోన్ మాత్రం తొలగించలేదు. దీంతో వీటి పరిధిలోకి వచ్చే గ్రామాల్లో భూముల ధరలు పెరగలేదు. పైగా భూముల రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయి. ఇప్పుడు ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పరిధిలో కొత్తగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తుండడంతో తమకు ఇబ్బందులు తొలుగుతాయామోనని స్థానికులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఫార్మాసిటీకి బదులు ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్నా తమ భూములపై ఆంక్షలు తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు

ఫ్యూచర్ సిటీ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మిస్తున్న 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను ముందుగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు ఊపందుకుంటాయని సర్కార్ భావిస్తోంది. ఔటర్ రింగురోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రీజినల్ రింగురోడ్డు వరకు 41.5 కి.మీ మేర నిర్మిస్తున్న 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులకు త్వరలోనే ప్రభుత్వం శంకుస్థాపన చేయనుంది. వారం, పదిరోజుల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే అదే రోజు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనానికి కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇదిలా ఉంటే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు రెండు దశల్లో జరగనున్నాయి. తొలిదశలో రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఫ్యూచర్ సిటీలోని మీర్‌ఖాన్‌పేట పరిధిలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 19.2 కిలో మీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తారు. రెండో దశలో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమన్‌గల్ రీజినల్ రింగురోడ్డు వరకు 22.3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడతారు. ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే స్కిల్ యూనివర్శిటీ వరకు మెట్రో రైలు నిర్మాణం కూడా ప్రభుత్వం చేపడుతోంది.

కలిసొచ్చిన కాలం.. కొరవడిన నీటి వినియోగం

ప్రాజెక్టులు కళకళ.. ఆయకట్టు వెలవెల

» నిండు కుండల్లా ప్రాజెక్టులు
» వృథాగా పోతున్న నీరు
» చివరి భూములకు నీరందని వైనం



జుంటుపల్లి ప్రాజెక్టు

తాండూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు తాండూరు ప్రాంతంలోని ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. కాలం కలిసొచ్చి నదులు, ప్రాజెక్టు, చెరువు, కుంటలు నిండుతున్నా ఆ నీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. జిల్లాలోనే పెద్దదైన కోట్‌పల్లి ప్రాజెక్టు ఐదేళ్లుగా 24ఫీట్ల మేర నీరుచేరి అలుగు పారుతున్నా ఈ ప్రాజెక్టు ఆయకట్టు పరిధి 9,200 ఎకరాల్లో కేవలం ఐదు వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. 1982లో ఆయకట్టు మొత్తానికి నీరందగా.. కాలక్రమేనా పారకం విస్తీర్ణం పడిపోయింది. కాలువలు పూడుకుపోయాయి. పది వేల మందికిపైగా రైతుల భూముల్లో నీరు పారడం లేదు. కొన్నేళ్లుగా జపాన్ నిధులతో తలపెట్టిన మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. పనులకు రూ.100కోట్ల వ్యయం అవుతుందని గతంలో అంచనా వేశారు. అప్పట్లో ప్రాజెక్టు నిర్వహణకు 12మంది గ్యాంగ్‌మెన్లు విధుల్లో ఉండి కాల్వలను తనిఖీ చేసేవారు. మరమ్మతులు అవసరమైతే అధికారులకు సమాచారమిచ్చేవారు. రిటైరైన గ్యాంగ్‌మెన్ స్థానంలో కొత్తవారిని నియమించలేదు. ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. కాగా, తాండూరు కాగ్నా నదిపై నిర్మించిన చెక్‌డ్యాంతో కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ భీమా నదికి నీరు తరలకుండా నివారించుకోగలిగాం. అయితే 35మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి సామర్థ్యం గల ఈ చెక్‌డ్యాం నిండి వరద కర్ణాటకకు తరలుతోంది. 2016 నుంచి చెక్‌డ్యాంలో నీరుంటున్నా భూగర్భ జలమట్టం పెంపునకే ఉపయోగపడుతోంది తప్ప నేరుగా నది నుంచి నీరు పారడం లేదు. ఇక్కడ లిఫ్ట్ పెడితే పొలాలకు నీటిని పారించొచ్చు.

భూములకందని నీరు

యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టు 20ఫీట్ల పూర్తి సామర్థ్యానికి చేరి అలుగెల్లుతోంది. మరింత నీటి నిల్వకు అలుగు ఎత్తును పెంచాల్సి ఉంది. ఈ నీటిని రబీ సాగుకు వదులుతున్నా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. తాండూరు మండలం అల్లాపూర్‌లోని శ్రీరాములవారి ప్రాజెక్టు 600 ఎకరాలకు నీరందిస్తోంది. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాక్రవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 2005లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. 1,200 ఎకరాలకు నీరందించేలా ఈ ప్రాజెక్టుకు అలుగు నిర్మాణించినా కొందరు నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించక కాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. శివసాగర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా సాగుకు పారించడం లేదు. నీరంతా కాగ్నా నదిలోకి వెళ్తోంది. బషీరాబాద్ మండలం నవాంద్గి ఎత్తిపోతల పథకం పనిచేయక 600 ఎకరాలు బీడుబారాయి. నవాంద్గి ఎత్తిపోతల మరమ్మతుల పేరిట అలంకారప్రాయంగా మారింది. గతంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల నుంచి నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించేలా గొలుసుకట్టు ప్రణాళికను రూపొందించింది. అయితే దశాబ్దాలు గడిచినా ప్రణాళికలు మాత్రం అమలు చేయడం లేదు.

గణేశ్ శోభాయాత్రకు సహకరించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వినాయక శోభాయాత్ర, నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్‌తో కలిసి పరిశీలించారు. అధికారుల సమన్వయంతోనే వినాయక నిమజ్జనం విజయవంతం అవుతుందన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

తహసీల్దారు కార్యాలయాన్ని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించారు. రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,862 దరఖాస్తులు వచ్చాయని, అందులో 700 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలో 552 దరఖాస్తులు రాగా 120 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలంలో 15 మంది లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించగా అందులో ఇద్దరు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మిగతా వారికి వచ్చే నెల 14న తిరిగి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు డీఎస్.రజిని, డీటీ రాజేందర్, సర్వేయర్ రూప, సీనియర్ అసిస్టెంట్ అదిత్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాగ్నా వాగును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

» 300 మంది పోలీసులతో బందోబస్తు
» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి): తాండూరులో జరిగే వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం యాలాల మండల పరిధిలోని కోకట్ కాగ్నా నది, బ్రిడ్జీని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వచ్చే ఆదివారం వినాకులను యాలాల మండల పరిధిలోని కోకట్ కాగ్నా బ్రిడ్జీ వద్ద నిమజ్జనం చేయాలన్నారు. మొత్తం 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో యువకులు మద్యం సేవించొద్దని, ఎలాంటి గొడవలు జరిగినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఆర్ఐ వేణు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం చెల్లించాలి

కడ్తాల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ఆశా కార్యకర్తలకు రూ.18 వేలు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయు కడ్తాల మండల కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. లేనియెడల పెద్దఎత్తున ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మండల కేంద్రంలో ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెంటయ్య హాజరై మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలన్నారు. సీఐటీయు నాయకులు, ఆశాలు పాల్గొన్నారు.

మండల నూతన కమిటీ

ఆశా కార్యకర్తల కడ్తాల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా సబిత, ఉపాధ్యక్షురాలిగా స్వరూప, భారతమ్మ, సహాయ కార్యదర్శులుగా అనిత, పద్మమ్మ, బుచ్చమ్మలు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను పెంటయ్య అభినందించి సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెంటయ్య

ఉత్తమ సాంకేతిక విద్య అందించడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్య అందించడమే శ్రీదత్త కాలేజీ లక్ష్యమని చైర్మెన్ పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగంలో నూతనంగా వస్తూన్న టెక్నాలజీకి అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ కళాశాల లక్ష్యమన్నారు. ఇంటర్మీడియంట్ విద్యను పూర్తి చేసుకొని ఇప్పుడే వృత్తి పరమైన ఇంజనీరింగ్ విద్యలోకి అడుగుపెడుతున్నా విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని ఉన్నత శిఖారాలకు చేరుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యతో పాటు మానవత విలువలతో కూడిన విద్యను నేర్పిస్తూ సమాజంలో ఉత్తమ ఇంజనీర్లను తయారుచేయడమే లక్ష్యమన్నారు. ఇంజనీరింగ్ కోర్స్ పూర్తి అయ్యేలోపు ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్స్ 100 శాతం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ చైర్మెన్ డాక్టర్ విభవ్‌రెడ్డి, సీఎండీ దేవేంద్ర విక్రమ్‌రెడ్డి, డైరెక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ బానుప్రకాష్‌రెడ్డి, డాక్టర్ వెంకట అచ్చుతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, వివిధ విబాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి మహమ్మద్ షఫియొద్దీన్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారి మహమ్మద్ షఫియొద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం మొయినాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కేతిరెడ్డిపల్లి సబ్‌సెంటర్ సెకండ్ ఏఎన్ఎం గంగమ్మ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహించడం, తరచూ గైర్హాజరవుతుండడంతో విచారించారు. ఆరోగ్య సమస్యతో హాజరుకావడం లేదని తెలుసుకొని నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో జ్వర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ తనిఖీలో ఆయనతోపాటు డీఎంహెచ్‌వో సూపరిండెంట్ ఈశ్వర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేందర్‌బాబు, మొయినాబాద్ పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ ఉన్నారు.

గోదావరికి చకచకా క్లియరెన్స్‌లు!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ మహానగరానికి, జంట జలాశయాలను నింపి మూసీలో నీరు ప్రవహింపజేసే గోదావరి మల్టీ పర్పస్ ప్రాజెక్టుకు క్లియరెన్స్ చకచకా వస్తున్నాయి. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ వరకు రెండు వరుసల్లో 3,500 డయా సామర్థ్యం కలిగిన రెండు భారీ పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు భూములు, వివిధ శాఖల అనుమతులు కావాల్సి ఉంది. ఇప్పటికే వాటర్‌బోర్డు అధికారులు ఆయా శాఖల ఉన్నతాధికారులతో చర్చించడంతో అనుమతులొస్తున్నాయి. హైదరాబాద్‌కు తాగునీరు, మూసీ ప్రక్షాళనకు గోదావరి ఫేజ్-2 మల్టీపర్పస్, ఫేజ్-3 ప్రాజెక్టులను వాటర్‌బోర్డు రూ.7,360కోట్లతో చేపడుతోంది. ఇందులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి రెండు వరుసల పైపులైన్లతో 26 కిలో మీటర్ల దూరం ఉన్న శామీర్‌పేట మండలం ఘన్‌పూర్ వరకు నీటిని తరలిస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి నగరానికి తరలిస్తారు. శుద్ధి చేయని నీటిని మరో పైపులైన్ ద్వారా ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్‌లకు తరలించనున్నారు. ఫారెస్టు, ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, హెచ్ఎండీఏ, పర్యావరణ ఇలా ఏడు శాఖల అనుమతులు సాధించాల్సి ఉన్నది. ఇప్పటికే ఫేజ్-1 కింద ఉమ్మడి రాష్ట్రంలోనే ఎల్లంపల్లిలోని ముర్మూరు నుంచి ఘన్‌పూర్ వరకు భూసేకరణ చేశారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి ఫేజ్-2, ఫేజ్-3 నుంచి తీసుకురాకుండా మల్లన్నసాగర్ నుంచి జలాలు తేనున్నారు. ఇప్పటికే కొండపోచమ్మ, ఘన్‌పూర్ మధ్యలో కొన్ని భూములు సేకరించి వినియోగిసస్తున్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం



ఇబ్రహీం శేఖర్‌ను సన్మానిస్తున్న ఆ పార్టీ నాయకుడు

శంషాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన ఇబ్రహీం శేఖర్‌కు శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఎస్పీ బలపడటానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కే అవకాశాలు బలంగా ఉన్నాయన్నారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలను కలసి పార్టీని మరింతగా బలోపేతం చేస్తానని చెప్పారు. అంతకు ముందు నాగర్‌కర్నూల్‌కు చెందిన బీఎస్పీ నాయకులు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్టు మార్గంలో నూతన అధ్యక్షుడికి స్వాగతం పలికారు.


నివాళులర్పిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

జైపాల్‌రెడ్డికి సుంకిరెడ్డి పరామర్శ

ఆమనగల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వెల్దండ జైపాల్ రెడ్డిని శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పరామర్శించారు. జైపాల్‌రెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి ఇటీవల మృతి చెందాడు. తిరుమలాపూర్‌లో మృతుడి కుమారులు యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కూతురు అలివేలమ్మలను సుంకిరెడ్డి పరామర్శించారు. రాంచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, ఉపాధ్యక్షుడు ఆనంద్, ఫౌండేషన్ సభ్యులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆమనగల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాంనుంతల చిన్నతండాలో నిర్మిస్తున్న తుల్జాభవానిమాత ఆలయానికి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.2లక్షల విరా ళం ప్రకటించారు. శుక్రవారం రూ.60వేల చెక్కును మాజీ సర్పంచ్ శ్రీరాములుతో కలిసి నిర్వాహకులకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ సరిత పంతూనాయక్, నాయకులున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- అధికారులు, అధ్యాపకులు, నాయకులు
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

షాబాద్/ఆమనగల్లు/చేవెళ్ల/షాద్‌నగర్ రూరల్/షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీడీవో అపర్ణ, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం షాబాద్ మండలం హైతాబాద్‌లో మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే హైదరాబాద్ ఆధ్వర్యంలో చెస్ పోటీల్లో జూనియర్, సీనియర్ స్థాయి ఫైనల్స్ నిర్వహించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి, ప్రతిభ కనబర్చిన షాబాద్, నందిగామ, కొత్తూర్ మండలాలకు చెందిన 20 మంది యువతను సన్మానించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీర ధారుఢ్యానికి దోహదపడుతాయని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ మహమూద్ అధ్యక్షతన నిర్వహించారు. పాపిశెట్టి రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు హాజరయ్యారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ధ్యాన్ చంద్‌ను ప్రతీక్రీడాకారుడు స్ఫూర్తిగా తీసుకోవాలని చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి తెలిపారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పాఠశాలలో నివాళులర్పించారు. విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లి శివారులో ఉన్న గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థినులకు ఖోఖో, పరుగు పందెం, కబడ్డీ, పాటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే, అధ్యాపకులు పావణి తదితరులు పాల్గొన్నారు. అలాగే కరాటే సాధన చేసే బాలికల్లో మనోధైర్యం పెరిగి, ఆత్మధైర్యంతో ముందుకు సాగుతారని తెలంగాణ రాష్ట్ర పాఠశాల క్రీడల కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నయ్య తెలిపారు. షాద్‌నగర్ పట్టణ సమీపంలోని నూర్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలచే కరాటే విన్యాసాలు చేయించారు. ప్రిన్సిపాల్ శైలజ ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వయించి, తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు.


ఆమనగల్లు : ధ్యాన్ చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాపిశెట్టి రాము, మహమూద్


షాద్‌నగర్ రూరల్ : ఆటలాడుతున్న విద్యార్థినులు


షాబాద్ : క్రీడాకారులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


చేవెళ్ల : మోడల్ స్కూల్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

(ఐదో పేజీ తరువాయి)

నిలిచాడు. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి ఏవోతో మాట్లాడారు. సోమవారం యూరియా అందుబాటులో ఉంటుందని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

యాచారంలో విజిలెన్స్ విచారణ

యూరియా కోసం యాచారం మండల కేంద్రంలోని సొసైటీ ఎదుట శుక్రవారం ఉదయం 8గంటలకే వివిధ గ్రామాల నుంచి రైతులు వచ్చి క్యూకట్టారు. మధ్యాహ్నం 12.30గంటలకు లారీలో 500 బస్తాల యూరియా వచ్చింది. కాగా, రెండు రోజుల క్రితం ఇచ్చిన స్లిప్‌ల ఆధారంగా ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియాను అందించారు. కాగా సాయంత్రం మరో లారీ లోడ్ వస్తుందని సమాచారమందడంతో రైతులు పడిగాపులు కాశారు. తీరా యూరియా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. సోమవారం 500బస్తాలు తెప్పించి పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి రవినాథ్ వివరించారు. కాగా, యూరియా పంపిణీపై విజిలెన్స్ అధికారులు చంద్రమౌళి, శ్రీనివాస్‌లు ఆరా తీశారు. వ్యవసాయాధికారులు, సొసైటీ అధికారుల వద్ద రికార్డులను పరిశీలించారు. యూరియా ఏమైనా పక్కదారి పడుతుందా అని విచారించారు. యూరియా పంపిణీ సక్రమంగానే జరుగుతుందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సొసైటీ వద్ద సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై సత్యనారాయణ బందోబస్తు నిర్వహించారు. క్యూలో నిల్చున్న రైతులకు సీఐ తన సొంత ఖర్చుతో వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు


యాచారంలో యూరియా పంపిణీపై విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

యూరియాను అందుబాటులో ఉంచాలి

రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు గుమ్మడి కురుమయ్య ప్రభుత్వాన్ని కోరారు. తలకొండపల్లి పీఏసీఎస్ గోదాం వద్ద రైతులతో కలిసి ఆయన కొద్దిసేపు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో బడా రైతులకు ఎక్కువ మొత్తంలో యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వరలక్ష్మీ, మంజుల, నర్సమ్మ, జగ్ని, రూప్ల, దామోదర్, కృష్ణయ్య, శ్రీనివాస్, శేఖర్, కుమార్, తదితరులు ఉన్నారు.

టోకెన్‌ల ద్వారా యూరియా పంపిణీ

కందుకూరు : మండల కేంద్రంలో రైతులకు ముందస్తుగా టోకెన్లు అందజేసి యూరియాను పంపిణీ చేశారు. సహకార సంఘ కేంద్రంలో 450యూరియా బస్తాలను అందుబాటులో ఉంచారు. శుక్రవారం మరో 500 బస్తాలు వచ్చింది. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రైతులకు టోకెన్‌లు అందజేశారు. పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. శనివారం మరో 500బస్తాలు వస్తాయని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తెలిపారు. శనివారం నుంచి గ్రామాలలోని రైతు వేదికల వద్ద ఏఈవోలు టోకెన్లు అందజేస్తారని తెలిపారు. టోకెన్ల ద్వారా యూరియా పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఉదయమే పలు ఎరువుల దుకాణాల వద్ద రైతులు యూరియా కోసం బారులుదీరారు. సరిపడా యూరియా సరఫరా లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించారు. పోలీసుల బందోబస్తు మధ్య యూరియా సరఫరా చేశారు. ఏడీఏ శోభారాణి, ఏవో శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షించారు. పాసు బుక్ ఆధారంగా రెండు బస్తాలు సరఫరా చేశారు.

మాడ్గులలోనూ అదే పరిస్థితి

మాడ్గుల మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం, మన గ్రోమోర్, రైతుసేవా కేంద్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఈమేరకు సరఫరా కేంద్రాలను తహసీల్దార్ వినయసాగర్, ఏవో అరుణకుమారిలు తనిఖీ చేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


కొత్తూర్ : నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

కొందుర్గు/కొత్తూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు ప్రదానం చేశారు. జీహెచ్‌ఎం గోపీనాథ్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి సేవలను కొనియాడారు. జాతీయ క్రీడా, తెలుగు బాషా దినోత్సవాన్ని కొత్తూర్ ఉన్నత పాఠశాలలో పీడీ నవనీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం భగవంతు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు బాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లి శివారులో ఉన్న గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళులర్పించారు. విద్యార్థినులు ఆట, పాటలతో అలరించారు. తెలుగు శాఖ అధ్యక్షురాలు రమణమ్మ, తెలుగు అధ్యాపకురాలు రాజేశ్వరి తెలుగు గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే, అధ్యాపకులు పావని తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు : నివాళులర్పిస్తున్న టీచర్లు

యూరియా కేటాయింపులో కేంద్రం విఫలం


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ

ఆమనగల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగుకు సరిపడా యూరియా కేటాయింపు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ ఆరోపించారు. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు కేంద్రంలోని తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డ్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో గీత మాట్లాడుతూ దేశ అవసరాలకు సరిపడా ఉత్పత్తి, దిగుమతులు లేకపోవడంతోనే వానాకాలం పంటల సాగుకు యూరియా కొరత ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టిందన్నారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు కృష్ణ, ఎంగళి ప్రసాద్, దుడ్డు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కొత్తూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొత్తూర్‌తో పాటు, మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో నేడు(శనివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ విస్తరణలో భాగంగా లైన్ షిఫ్టింగ్ కారణంగా కొత్తూర్ టౌన్‌లోని 11కేవీ ఫీడర్, 11కేవీ ఐడీఏ తిమ్మాపూర్ ఫీడర్ పరిధిలోని తిమ్మాపూర్, తిమ్మాపూర్ చౌరస్తా, కొత్తూర్ టౌన్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

డీజేలు ఏర్పాటు చేయొద్దు

కడ్తాల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు, నిమజ్జన వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ గంగాధర్ అన్నారు. డీజేలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. కడ్తాల పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మండల పరిధిలోని డీజేల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గణేశ్ చతుర్థి నేపథ్యంలో ఉత్సవ కమిటీలకు డీజేలను ఇవ్వొద్దని సూచించారు. ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్సై బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

రైతులందరూ సంఘటితంగా ఉండాలి

చేవెళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పార్టీలు వేరైనా రైతులందరు సంఘటితంగా ముందుకుసాగాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నారాయణదాస్ గూడలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరాం భగవన్ జన్మదినం సందర్భంగా జెండాను ఆవిష్కరణ చేశారు. వ్యవసాయానికి ఆదిమూలం బలరాముడే అని అన్నారు. ఆయన్ను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీటీసీ కావలి రవీందర్, మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రైతు సంఘం నాయకులు పెంటారెడ్డి, వీరేశం, రాంరెడ్డి, దశరథరెడ్డి, శివకుమార్, ఈశ్వరప్ప, రమణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శంకరయ్య, సత్యనారాయణ, సత్తయ్య, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు. ప్రతి నిత్యం భూమిలో శ్రమచేస్తూ అందరి ఆకలి తీర్చేలా శ్రమిస్తున్న రైతే భగవంతునితో సమానమని భారతీయ కిసాన్ సంఘ్ షాబాద్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. బలరాముడి జన్మదినం పురస్కరించుకొని షాబాద్ మండలం సంకేపల్లిగూడ, కక్కులూర్, షాబాద్ తదితర గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం జరుపుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వినాయకుడికి విశేష పూజలు

- వైభవంగా కొనసాగుతున్న గణేశ్ నవరాత్రోత్సవాలు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/చేవెళ్ల/కొత్తూర్/షాబాద్/శంకర్‌పల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పార్వతి తనయుడు గణపయ్య భక్తులచే విశేష పూజలందుకుంటున్నాడు. ఆమనగల్లు పట్టణంతో పాటు కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద మూడో రోజు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చేవెళ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుడికి భక్తులు ఘనంగా పూజలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని వెంకటరమణ కాలనీలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం పాల్గొన్నారు. బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలో గణనాథుని పూజలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. షాబాద్ మండల కేంద్రంలో యువకులు శుక్రవారం రాత్రి పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలివెళ్లారు. గోల్డ్‌ఫేస్ కాలనీలోని, పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతిష్ఠించిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గణేష్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, మాజీ సర్పంచ్ ఆత్మలింగం. నాయకులున్నారు. కడ్తాల మండలం మైసిగండిలో హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పూజలుచేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, తదితరులున్నారు.


షాబాద్ : గోల్డ్‌ఫేస్ కాలనీలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


కడ్తాల్ : మైసిగండిలో పూజల్లో భక్తులు

తహసీల్దార్‌కు నాయకుల సన్మానం

మహేశ్వరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నూతనంగా మహేశ్వరం మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చిన్న అప్పలనాయుడును శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు తెల్గమల్ల యాదీష్ పలువురు నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని రెవెన్యూ సమస్యలను తహసీల్దార్‌కు వివరించామని యాదీష్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఎ.యాదయ్యగౌడ్, కరుణాకర్, శేఖర్, మల్లేష్, పాండు, మాదవ్ తదితరులు ఉన్నారు.



సంక్షిప్తంగా..

చౌదరిగూడ : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో హన్మంత్‌రెడ్డిలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని 24 గ్రామ పంచాయతీ పోలింగ్ బూత్‌లో ఉన్న సదుపాయాలను తిరిగి పరిశీలించారు.

కడ్తాల్ : దేవాలయాలు ఆధ్యాత్మిక వారసత్వానికి నిలయాలని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కానుగుబావి తండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జాభవాన్ని మాత దేవాలయాన్ని శుక్రవారం సుంకిరెడ్డి సందర్శించారు. ఆలయ నిర్వాహకులు, తండా వాసులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి రూ.లక్ష మొదటి దఫా విరాళం అందజేసిన సుంకిరెడ్డిని తండావాసులు అభినందించారు. గిరిజనుల కోరిక మేరకు ఆలయ పెయింటింగ్ పనులను పూర్తి చేయించి అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు.

తలకొండపల్లి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వెల్జాలలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.5లక్షలతో నిర్మించే తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను నాయకులతో కలిసి ప్రారంభించారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కమిటీ అధ్యక్షుడిగా విజయప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉద్యోగుల సర్వసభ సమావేశం కోట్ల అశోక్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీనరసింహారావు, జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. విశ్రాంత ఉద్యోగులు విజయప్పను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడు మృతి


శేఖర్ (ఫైల్)

ఆమనగల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఆమనగల్లు పట్టణంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు.. మండలంలోని మంగళపల్లికి చెందిన దురువుల శేఖర్ (20) పట్టణంలోని ఓ చికెన్ షాపులో పనిచేసేవాడు. గురువారం అర్ధరాత్రి బైక్‌పై స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఆమనగల్లు రాజీవ్ చౌక్ వద్ద జాతీయ రహదారిపై శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇన్నోవా కారు శేఖర్ వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. దాంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శేఖర్ మృతితో మంగళపల్లిలో విషాదం నెలకొంది. మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

పురుగుల మందు తాగి కార్మికుడి ఆత్మహత్య

- న్యాయం చేయాలని పరిశ్రమ వద్ద బంధువుల ఆందోళన

నందిగామ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం నందిగామలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం జీడిగడ్డతండాకు చెందిన పాత్లావత్ మోహన్(32) ఎనిమిదేళ్లుగా నందిగామ మండల కేంద్రంలోని హైదరాబాద్ సిలిండర్ పరిశ్రమలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం డ్యూటీకి వచ్చిన మోహన్ వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగడంతో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. తోటి కార్మికులు పరిశ్రమ యాజమాన్యానికి, మోహన్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మోహన్ ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, అందుకే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు వాంగ్మూలం ఇచ్చాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని పరిశ్రమ వద్ద ఆందోళన చేశారు. మృతుడి భార్య రేణక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతుడు మోహన్‌కు పాప, బాబు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

క్షతగాత్రుల్లో ఏఆర్ కానిస్టేబుల్

యాచారం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంక్ డీసీఎం ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డ ఘటన శుక్రవారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధి కొత్తపల్లి సమీపంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన పి.పరమేష్(30) ఏఆర్ కానిస్టేబుల్. బైక్‌పై విధులకు వెళుతుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌ను బైక్‌పై ఎక్కించుకున్నాడు. తక్కళ్లపల్లి శివారులో సెప్టిక్ ట్యాంక్ డీసీఎం వారి బైక్‌ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెట్రోమొబైల్ పోలీసులు క్షతగాత్రులను ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో 3 మేకలు, లేగదూడ మృత్యువాత

కొత్తూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని కుమ్మరిగూడలో శుక్రవారం ఉదయం కుక్కల దాడిలో మూడు మేకలతో పాటు లేగదూడ మృత్యువాతపడ్డాయి. బాధిత రైతు బండారు శ్రీరాములు కథనం ప్రకారం.. తన ఇంటి వద్ద మేకలతో పాటు, లేగదూడ పెంచుకుంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కుక్కలు మేకలతో పాటు లేగదూడపై దాడి చేసి పీక్కుతిన్నాయి. శ్రీరాములు నిద్ర నుంచి లేచిచూసేసరికి మేకలు, లేగదూడ మృతి చెంది ఉన్నాయి. కాగా, కుక్కలు కొంతకాలంగా గ్రామంలో స్వైరవిహారం చేస్తూ చిన్నారులపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు శ్రీరాములు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరాడు.

పేకాట స్థావరంపై ఎస్వోటీ దాడి

- రూ.32వేలతో పాటు 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కొత్తూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల ఓ రియల్ వెంచర్‌లో పేకాట స్థావరంపై శుక్రవారం స్థానిక పోలీసులతో కలిసి శంషాబాద్ ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.32వేల నగదుతో పాటు 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఒకరు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమించి మోసం చేశాడని ప్రియురాలి ఆందోళన

- ప్రియుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగిన వైనం

మాడ్గుల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని ప్రియురాలు ధర్నాకు దిగిన సంఘటన మండలంలోని సుద్దపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు.. సుద్దపల్లికి చెందిన ఐలమోని శివయాదవ్.. నల్గొండ జిల్లా, చింతపల్లి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన ఓ దళిత యువతి క్లాస్‌మేట్స్. నాలుగేళ్లుగా వారు ప్రేమించుకున్నారు. ఈక్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించిన శివయాదవ్.. తనను మోసం చేశాడని యువతి గ్రహించింది. ఈమేరకు శుక్రవారం శివ ఇంటి ముందు ధర్నాకు దిగింది. తనను నమ్మించి మోసం చేశాడని.. న్యాయం చేయాలని, లేనియెడల పెట్రోల్ పోసుకొని చనిపోతామని యువతి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ఇంటి ముందు కూర్చొని నిరసన తెలిపింది. పోలీసులు అక్కడికి చేరుకొని న్యాయం జరిగేలా చేస్తామన్నారు. చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయమని సీఐ వేణుగోపాల్ సూచించారు. అయితే, అక్కడ ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేని యువతి కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

శంషాబాద్ 'సబ్‌స్టేషన్'లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

శంషాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఇంజనీర్ పాండ్య నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. మల్కారం, శంకరాపురం గ్రామాల్లో కొత్త ఫీడర్లు ఏర్పాటు చేశారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్‌లు డైరెక్టుగా ఉండకుండా చూడాలని ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులను ఏఈ బాష కోరారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఇంజనీర్ పాండ్య

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ఔదార్యం.. టాయిలెట్ల నిర్మాణ పనులకు శ్రీకారం

కేశంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ఔదార్యాన్ని చాటుకున్నారు. సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఎమ్మెల్సీ కేశంపేట మండలం నిర్దవెల్లి ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. మరుగు దొడ్లు, మూత్రశాలలు లేవని విద్యార్థులు ఆయనకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లోగా సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం టాయిలెట్ల నిర్మాణ పనులను కేశంపేట మండల బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. మాజీ వైస్‌ఎంపీపీ సురేందర్, మాజీ సర్పంచులు వెంకటయ్య, జంగయ్య, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, బాలరాజు గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, సింగిల్‌విండో డైరెక్టర్లు పల్లాటి కృష్ణయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.